'లెక్కా'..పత్రం తప్పనిసరి..!

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగదు, బంగారు తదితర వాటి రవాణాపై ఆంక్షలు అమల్లోకి వస్తాయి. ఈ విషయంలో సామాన్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అధికారులు ఎక్కడికక్కడ నిరంతరం తనిఖీలు చేస్తుంటారు. రూ.50వేలకు మించి డబ్బు లభిస్తే వాటికి సంబంధించిన వివరాలను కచ్చితంగా అధికారులకు చూపించాలి. లేకుంటే ఆ డబ్బును సీజ్ చేస్తారు.

నగదుతో పాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా రసీదులు తప్పనిసరి. కొనుగోలు అమ్మకాలు, ఆస్పత్రుల బిల్లులు, చెల్లింపులు ఇలా ప్రతి దానికి సబంధించిన ఆధార పత్రాలు ఉంటేనే చేతిలో నగదును పట్టుకుని బయటకు వెళ్లాలి. సామాన్య జనం అంతా ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు

నగారా మోగె.. కోడ్ కూసె..!

- ఇక అంతా మాజీలే..!
- మే 13న పోలింగ్ ◆ జూన్ 4న కౌంటింగ్
- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయవేడి
- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రకటన
- నేటి నుంచి ఊపందుకోనున్న ప్రచారం
- ఎన్నికల నిర్వహణలో అధికారులు బిజీబిజీ

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల నగరా మోగింది. రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పచ్చ జెండా ఊపుతూ షెడ్యూల్ ప్రకటించింది. ఈ ప్రకటనతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం మారిపోయింది. రాజకీయ పార్టీల నాయకులు ప్రచార పనుల్లో తలమునకలు కాగా, అధికారులు పకడ్బందీగా ఎన్నికల నిర్వహించే దానిపై నిమగ్నం అయ్యారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన స్థానాల్లో ప్రచారాలు జరుగుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నేటి నుంచి ప్రచార వేడి మరింత పెరగనుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నగార మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు షెడ్యుల్‌ను విడుదల చేసింది. నాలుగో దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నట్టు ప్రకటించింది. ఇప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్నట్టు తెలిపింది. దీంతో ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా కొనసాగిన వారు తాజా మాజీలు కానున్నారు. రాష్ట్రమంతటా ఒకేసారి ఎన్నికలు కావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగో దశలోనే పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో శనివారం నుంచి ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల హోర్డింగ్‌లు, ప్రకటనలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డుల తొలగింపు ప్రక్రియ ఆరంభం అయ్యింది. ఎన్నిల ప్రక్రియ పారదర్శకంగా సాగేలా అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. ఇక రాజకీయ పార్టీలు గెలుపే లక్ష్యంగా అస్త్రశస్త్రాల ఎన్నికల రణరంగంలోకి దూకనున్నారు.

ఏప్రిల్ 18న నోటిఫికేషన్

ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన మేరకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అప్పటి నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి ఉంటుంది. ఏప్రిల్ 25వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. ఏప్రిల్ 26వ తేదీన నామినేన్ల పరిశీలన ఉంటుంది. అప్పటి నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తవుతుంది. అప్పటి నుంచి ప్రచారాలు ప్రారంభమై మే 11వ తేదీ సాయంత్రంతో ప్రచారాలు ముగుస్తాయి. మే 13వ తేదీ పోలింగ్ జరగనుంది. జూన్ 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుంది.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. రాజకీయ పార్టీల ప్లెక్సీలు, ఫొటోలను తొలగించాలని సూచించింది. అదే విధంగా ఆన్‌లైన్‌లో ఉన్న మంత్రులు ముఖ్యమంత్రుల చిత్రాలను తొలగించాలని పేర్కొంది. రాజకీయపరమైన కార్యక్రమాల్లో అధికారులు ఎవరైనా పాల్గొంటే చట్టపరమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఎన్నికల నియమావళిని పూర్తి స్థాయిలో అమలు చేయడంపై దృష్టి సారించారు. ఇప్పటికే పలు దఫాలుగా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన అధికారులు ఎన్నికల నియమావళిని తెలియజేసేందుకు కూడా సమావేశం నిర్వహించి విధి విధానాలను తెలియజేస్తారు. ఎన్నికల ప్రచారం, సమయపాలన, అభ్యర్థుల పెట్టే ఖర్చు తదితర అన్నీ కూడా ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలి. నియమావళిని అతిక్రమించే అభ్యర్థులపై పోటీ నుంచి అనర్హత పడే అవకాశం ఉంది. ఇక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే రోజు నుంచే ఆయన వ్యయం లెక్కింపు చేస్తారు. అభ్యర్థి ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరిచి ఆ ఖాతా నుంచే ఎన్నికల వ్యయం లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది.

పోలింగ్ కేంద్రాలు
అనంతపురం జిల్లా : 2,213
శ్రీసత్యసాయి జిల్లా : 1571

ఎన్నికలకు సంబంధించి ముఖ్యమైన రోజులు

తేదీ	
ఏప్రిల్ -18-25	నామినేషన్ల స్వీకరణ
ఏప్రిల్ -29	నామినేషన్ల ఉపసంహరణ
మే -13	పోలింగ్ తేది
జూన్ -4	ఓట్ల లెక్కింపు..ఫలితాలు

శ్రీ సత్యసాయి జిల్లా ఓటర్ల వివరాలు

	హిందూపురం	మడకశిర	పెనుకొండ	ధర్మవరం	కదిరి	పుట్టపర్తి
పురుషులు	1,23,974	1,06,242	1,17,310	1,19,086	1,23,742	1.04.092
మహిళలు	1,22,471	1,04,831	1,16,369	1,20,451	1,27,027	1.05.970
ఇతరులు	18	01	03	20	07	14
మొత్తం ఓటర్లు	2,46,463	2,11,074	2,33,682	2,39,557	2,50,776	2.10.076

అనంతపురం జిల్లా ఓటర్ల వివరాలు

	అనంతపురం అర్బన్	శింగనమల	తాడిపత్రి	ఉరవకొండ	కళ్యాణదుర్గం	రాయదుర్గం	గుంతకల్లు	రాప్తాడు
పురుషులు	136761	122341	121499	109905	113196	1 29090	131304	124081
మహిళలు	141679	123257	122562	112788	114236	131736	135656	124219
ఇతరులు	35	27	24	30	07	33	76	13
మొత్తం ఓటర్లు	278475	245625	244075	222723	227438	260859	267036	248313

గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

అభ్యర్థుల సౌలభ్యం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఆదివారం నాడు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ, గ్రూప్ - 1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్షల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్షలు రెండు సెషన్‌లలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. అభ్యర్థులు ఉదయం గ్రేస్ పీరియడ్‌తో కలిపి 9-45 గంటల వరకు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1-45 గంటల వరకు అనుమతిస్తారన్నారు. పరీక్షల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, పుస్తకాలను కేంద్రంలోకి తీసుకురాకూడదన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నంబర్ :08554-220009 అందుబాటులో ఉంటుందన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే సంప్రదించాలని కోరారు.

పది పరీక్షలకు పకడ్బందీగా చర్యలు

ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 40,063 మంది హాజరుకానున్నారని తెలిపారు. 142 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యా హ్నం 12:45 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.40గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్లు చూపించి ఆర్టీసీ బస్‌ల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం అనంతపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9441575778, 9440594773 నంబర్లతో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు.

మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఏపీవోఎస్ఎస్, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 3,749 మంది హాజరవుతారని, వీటి నిర్వహణకు కూడా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు: కలెక్టర్

పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. శనివారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం, కషి ఎనలేనిదన్నారు. రాష్ట్ర స్థాన ఆశయసాధనలో ఆయన ప్రాణాలర్పించి అమరజీవి అయ్యారని తెలిపారు. స్వాతంత్ర ఉద్యమంలో కూడా గాంధీ మార్గంలో నడిచి అనేక ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, బిసి సంక్షేమ శాఖ డిడి ఖుష్బుకొఠారి, ఎస్డీసీ ఆనంద్, హ్యాండ్లూమ్స్ అభివద్ధి అధికారి బసవరాజు, కలెక్టరేట్, బిసి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి జట్టు సిద్ధం..!

- పూర్తి స్థాయి జాబితా విడుదల ◆ ఆఖరి జాబితాలో అంతా సిట్టింగ్‌లకే అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అనేక విడతలుగా అభ్యర్థులు ప్రకటిస్తూ వచ్చింది. తాజాగా శనివారం విడుదల చేసిన జాబితాతో పూర్తి స్థాయి అభ్యర్థులను ప్రకటించింది. అంతకు మునుపు వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించింది. ఆఖరి జాబితాలో మిగిలిన ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. పాతవారితో కలిపి మొత్తం జాబితాను మరోమారు ప్రకటించింది. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరుపున బరిలో దిగే అభ్యర్థులెవరన్న లెక్కి తేలింది. ఆఖరు జాబితాలో ఎటువంటి మార్పుల్లేకుండా సిట్టింగులకే చోటు కల్పించింది.

శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి అభ్యర్థులు

మక్బుల్ బాషా (కదిరి)

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (ధర్మవరం)

దీపిక (హిందూపురం)

ఈరలక్కప్ప (మడకశిర)

దద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి)

ఉషశ్రీ చరణ్ (పెనుకొండ)

పార్లమెంట్ అభ్యర్థులు

శంకర నారాయణ (అనంతపురం)

శాంతమ్మ (హిందూపురం)

అనంతపురం జిల్లా వైసిపి అభ్యర్థులు

అనంత వెంకటరామిరెడ్డి (అనంతపురం అర్బన్)

వై.వెంకట రామిరెడ్డి (గుంతకల్లు)

తలారి రంగయ్య (కళ్యాణదుర్గం)

మెట్టు గోవిందరెడ్డి (రాయదుర్గం)

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (రాప్తాడు)

కేతిరెడ్డి పెద్దారెడ్డి (తాడిపత్రి)

వై. విశ్వేశ్వరరెడ్డి (ఉరవకొండ)

వీరాంజి నేయులు (శింగనమల)

అసెంబ్లీ బరిలో నిలిచే వైసిపి అభ్యర్థులు వీరే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో అన్ని స్థానాలకు వైసిపి అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిగా అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లుకు వై.వెంకటరామిరెడ్డి, తాడిపత్రికి పెద్దారెడ్డి, ఉరవకొండకు వై.విశ్వేశ్వరరెడ్డి, దర్మవరానికి కేతిరెడ్డి వెంకటరావమిరెడ్డి, రాప్తాడుకు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, పుట్టపర్తికి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్లను ప్రకటించారు. వీరిలో విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా ఉండగా, మిగిలిన వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఇక అంతకు మునుపు సమన్వయకర్తలుగా ప్రకటించిన శింగనమలకు వీరాంజినేయులు, కళ్యాణదుర్గంకు తలారి రంగయ్య, పెనుకొండ ఉషచరణ్ శ్రీ, హిందూపురం దీపిక, మడకశిర ఈరలక్కప్ప, కదిరి మక్బుల్ బాషాలను అభ్యర్థులుగా ప్రకటించారు. ఇక పార్లమెంటుకు స్థానాలకు సంబంధించి అనంతపురానికి శంకర నారాయణ, హిందూపురానికి శాంతమ్మ పేర్లు ప్రకటించారు.

వైసిపి తరుపున తేలిపోయిన అభ్యర్తులు

వైసిపి సార్వత్రిక ఎన్నికలకు పూర్తి స్థాయి అభ్యర్థులు తెలారు. ఇన్ని రోజులు పోటీలో నిలిచేదెవరన్న దానిపై కొన్ని నియోజకవర్గాల్లో సస్పెన్స్ నడుస్తూ వచ్చింది. శనివారం నాడు అధిష్టానం అన్ని స్థానాలపై స్పష్టతను ఇచ్చేసింది. ప్రతిపక్ష టిడిపిలోనే ఇంకా రెండు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులెవరన్నది ఇంకా ప్రకటించలేదు. అదే విధంగా పార్లమెంట్ అభ్యర్థులు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నారు. వైసిపి మాత్రం ఎన్నికల షెడ్యూల్ వెలువడే సమయానికి అభ్యర్థులను ప్రకటించి పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యింది.

24న రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీలు

అనంతపురం : అనంతపురంలోని కనకదాస కళ్యాణ మండపంలో ఈనెల 24న ఏ1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నరసింహారెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం నగరంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కేటగిరిల్లో ప్రతిభ చూపిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, మరియు ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో రూ.లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.వెయ్యి ప్రవేశ రుసుం చెలించి టోర్నమెంట్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పావురాల జగదీష్‌బాబు, ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఛైర్మన్ బాలరాజు, టోర్నమెంట్ డైరెక్టర్ కిషోర్‌నాయుడు, కోఆర్డినేటర్ గోవిందరాజులు, చెస్ కోచ్ మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా సెల్‌ఫోన్లు కొనొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బిల్లులు, బాక్సు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు కొనవద్దని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. ఎస్పీ నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రూ.83 లక్షల విలువజేసే 311 సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 311 ఫోన్లలో పోగొట్టుకున్నవి 268 అయితే చోరీకి గురైనవి 43 ఉన్నాయన్నారు. ఈమొబైల్ ఫోన్లలో అనంతపురం జిల్లా నుంచి 259, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 31, కర్నూలు నుంచి 10, కర్నాటక నుండి 05, తెలంగాణా నుంచి 2, గుంటూరు జిల్లా నుంచి 1 రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరైనా అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దని సూచించారు. అపరిచితులతో ఫోన్ కొనడం వల్ల ఇటు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు, అటు కొన్న వ్యక్తి ఇద్దరూ నష్టపోతారన్నారు.

ఫోన్ చోరీకి గురైనా.. మిస్ అయినా.. చాట్‌బాట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిఇఐఆర్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లా పోలీస్ సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, సిబ్బందిని అభినందించడమే కాకుండా సెల్‌ఫోన్ల రికవరీలో మంచి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించే వారిపై సమీపంలోని పోలీసుస్టేషన్‌కు, ఎస్పీ మొబైల్ ఫోన్ 94407 96800కు సమాచారం చేరవేయాలని కోరారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

అనంతపురం : ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ సంస్థ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు, పరీక్ష అనంతరం తిరిగి ఇంటికి చేరేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

గవిమఠం ఉత్సవాల్లో ఆకతాయిలను నియంత్రించండి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్

ప్రజాశక్తి-ఉరవకొండ

గవిమఠం ఉత్సవాల్లో ఆకతాయిలు శబ్ద కాలుష్యం, మహిళలపై వేధింపులను ఆపేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్ కోరారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రాఘవేంద్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండలో సంవత్సరానికి ఒక సారి దాదాపు 4 రోజులపాటు అట్టహాసంగా జరిగే గవిమఠం బ్రహ్మోత్సవాలకు జిల్లాతోపాటు కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర నలుమూలల నుంచి పిల్లాపాపలతో సకుటుంబ సమేతంగా భక్తులు వస్తుంటారన్నారు. అయితే కొంతమంది ఆకతాయిలు చర్యల వల్ల మంచి వాతావరణంలో జరగాల్సిన తిరునాల భక్తులకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతోందన్నారు. ముఖ్యంగా చాలామంది ఆకతాయిలు శబ్ద కాలుష్యాలతో అల్లరి చేసుకుంటూ మహిళలను వేధిస్తారన్నారు. కావున ఆకతాయిల నుంచి మహిళలపై వేధింపులను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు హిరణ్య, నందు, నాయకులు సతీష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చిలకలూరిపేట సభను విజయవంతం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిలకలూరిపేటలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఉమ్మడి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అర్బన్ పార్టీ కార్యాలయంలో క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిలుకలూరిపేటలో ప్రజాగళం పేరుతో ఎన్నికల సమరానికి సమరశంఖం పూరిస్తున్నారు. నియోజకవర్గం నుంచి వెళ్లేందుకు 300 వాహనాలు, భోజన సౌకర్యాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు మారతీకుమార్‌గౌడ్, దేవళ్ల మురళి, రమణ, నటేష్‌చౌదరి, నారాయణస్వామి యాదవ్, డిస్కో బాబు, రాజారావు, గోపాల్‌గౌడ్, వస్నూరప్ప, నెట్ కాన్ చంద్ర, జె.ఎం.బాషా, బోయపాటి పూలప్ప, సాకే నరేష్, వెంకటేష్, మార్కెట్ మహేష్, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, కృష్ణవేణి, దేవి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, తులసి, రాధ, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

కట్టుదిట్టంగా 'పది' పరీక్షలు

విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి

ప్రజాశక్తి-నార్పల

ఈనెల 18వతేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పరీక్ష పర్యవేక్షకులు, తనిఖీ అధికారులు, పోలీసు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పరీక్ష విధుల నుంచి తొలగించడంతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మండలంలోని 12 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 672 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఇఒలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను మండల విద్యాశాఖ అధికారులు నరసింహారెడ్డి, రామాంజనేయులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఏర్పాట్లపై స్థానిక సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల నిమిత్తం మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఇంటి స్థలం బదలాయింపు రిజిస్ట్రేషన్ దస్తావేజులను ఎమ్మెల్సీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనకొండ్ల గ్రామంలో 594 మంది స్థలం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా 320 మందికి దస్తావేజులు పంపిణీ చేసినట్లు తెలిపారు. త్వరలోనే ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందించే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వై.భీమిరెడ్డి, సర్పంచి సంచెప్ప ఇంద్రమ్మ, ఎంపిటిసి ముద్దయ్య, మణయ్య, పాపన్న, నాయకులు రామచంద్ర, లాలెప్ప, గురుప్ప, గురు, గోపాల్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

'గుమ్మనూరు' సోదరుల తీరు సరికాదు : టిడిపి

గుంతకల్లు : ఇటీవల టిడిపిలో చేరిన మాజీ మంత్రి జయరామ్ సోదరులు క్రమశిక్షణగా ఉండాలని టిడిపి సీనియర్ నాయకులు సూచించారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జయరామ్ టిడిపిలో చేరిన తర్వాత స్థానిక ఇన్‌ఛార్జిని కలవకుండా సోదరులతో పామిడి,గుత్తి పట్టణాల్లో టిడిపి కార్యకర్తలతో ఏకపక్షంగా సమావేశాలు పెట్టి తమ అన్నకే టికెట్టు వస్తుందని చెప్పుకోవడం సరైంది కాదన్నారు.కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను చేస్తున్న జితేంద్రగౌడ్‌కు టికెట్టు వస్తుందని రాష్ట్ర అధ్యక్షులు తమకు హామీ ఇచ్చారన్నారు. అధిష్టానం ఇప్పటి వరకూ టికెట్టు ఎవ్వరికీ ఇచ్చేదీ తెల్చలేదని, కావున పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా గుమ్మనూరు సోదరులు నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి యువనేత ఆర్.దర్మతేజ్‌గౌడు, బిసి సెల్ జిల్లా నాయకులు కేశప్ప, హనుమంతు, గుమ్మనూరు వెంకటేశులు, పాల మల్లికార్జున, తలారి మస్తానప్ప, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిది

జయంతి కార్యక్రమంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌ఐ రాముడు, ఎఒ శంకర్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులనాయుడు, తేజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గుత్తి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని బేతపల్లి గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఓబులపతి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సులోచన, శివప్రసాద్, సాధన, రవీంద్రనాథ్‌రెడ్డి, సుజాత, చంద్రకళ, నిరుపమ, రామకృష్ణయ్య, మాదన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పెన్షనర్స్ భవన్లో ఏపీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్యాముల్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

శింగనమల చెరువు లోకలైజేషన్ చారిత్రాత్మకం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గం నుంచి అనేకమంది ఎమ్మెల్యేలు, మంత్రులు సాధించలేని శింగనమల చెరువు లోకలైజేషన్ సాధించి చరిత్ర సృష్టించామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శనివారం మండల పరిధిలోని మరువకొమ్మలో చెరువు వద్ద ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే రెండవ అతిపెద్ద శింగనమల చెరువును నిండితే భూగర్భజలాలు పెరిగి చుట్టుపక్కల అనేక గ్రామాల రైతన్నలు వ్యవసాయం చేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. అలాంటి చెరువు లోకలైజేషన్ చేసేందుకు 1978 నుంచి ఎన్నికల హామీగా మార్చేశారన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి చెరువును లోకలైజేషన్ చేయించామన్నారు. తద్వారా ఒక టీఎంసీ నీరు కేటాయించేందుకు జీవో తీసుకొచ్చామని గుర్తు చేశారు. చెరువులో నీరు ఉంటే 300 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎంతో ఆధారం లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు ఆలూరు రమణారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, ప్రమీల, పరందామరెడ్డి, వెంకటనారాయణ, శివమ్మ, బండి లలిత, నాగవర్ధన్‌రెడ్డి, శెట్టిపల్లి నరసింహారెడ్డి, ఏడావులపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బంగారు అలీబాషా, నిమ్మకాయల భాస్కర్, చిక్కల్ల బాలకృష్ణ, బెస్త ప్రసాద్, చాగంటి సుబ్బారెడ్డి, చాగంటి ప్రతాపరెడ్డి, చెవిరెడ్డి, చలపతి, వెంకటప్ప, పార్వతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల చెరువు వద్ద స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణ

శింగనమల : వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన తప్పెట వెంకట నారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజక వర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

సురేంద్రబాబుకు ఘన స్వాగతం

కళ్యాణదుర్గం : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు పలు గ్రామాల్లో శనివారం ఘన స్వాగతం లభించింది. ముందుగా కమ్మూరు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, మహిళలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి మేళతాళాల మధ్య ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దండా వెంకటేశులు, సుబ్బరాయుడు, శివన్న, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పామిడి : మండల కేంద్రంలోని 3వ అంగన్వాడీ సెంటర్‌లో ఎసిడిపిఒ నాగమణి ఆధ్వర్యంలో శనివారం పోషణ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, యుక్త వయసు బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం హ్యాండ్ వాష్, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జ్యోతి, జె.ఎల్.నారాయణమ్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో అనంత విద్యార్థి ప్రతిభ

అనంతపురం : అఖిల భారత స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆఫ్ ఇంజనీరింగ్ మెకానికల్ విభాగంలో అనంత విద్యార్థి ఆకుల శ్రీచరణ్ 359వ రాంకు సాధించారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న అసిస్టెంట్ డైరెక్టర్ పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న ఎవి.రత్నకుమార్, రాధాదేవి దంపతుల కుమారుడు శ్రీచరణ్ కర్నాటకలోని నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నాడు. ఈనేపథ్యంలో జాతీయస్థాయి ర్యాంకు రావడంతో చరణ్‌కు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు అయిన బిహెచ్ఇఎల్, బిడిఎల్, బిఇఎంఎల్ వంటి సంస్థల్లో గౌరవప్రదమైన ఉద్యోగంతో పాటు దేశంలో పేరున్న విశ్వవిద్యాలయాల్లో పిజి సీట్ వస్తుందని తల్లిదండ్రులు తెలిపారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

గుత్తి : యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఎన్నికల నిఘా వేదిక నియోజకవర్గం డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ డిగ్రీ కళాశాల, శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బరిలో ఉన్న నేరచరితులు,అవినీతిపరులను తిరస్కరించాలన్నారు. అలాంటివారిని చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రంగస్వామిరెడ్డి, ఎంఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలిమ, అధ్యాపకులు అన్వర్‌బాషా, సత్యనారాయణరెడ్డి, నిజాముద్దీన్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు సి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి పరికరాలు అందజేత

అనంతపురం : అమ్మ సంస్థ అధ్వర్యంలో శనివారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ రకాలు పరికరాలను అందజేశారు. ఇందులో భాగంగా పీడియాట్రీషన్ వార్డుకు పిల్లల ఆరోగ్య దృష్ట్యా సుమారు రూ.80వేలు విలువజేసే 20 నెబులైజర్స్, రీ సైకిలింగ్ మాస్కులు 25 అందజేసినట్లు అమ్మసంస్థ అధ్యక్షులు తరిమెల రమణరెడ్డి తెలిపారు. ఆయా వస్తువులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావుకు అందజేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమములో ఆర్‌ఎంఒలు డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ఉరవకొండ : వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో తన స్వగృహంలో పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం పంపిణీ చేశారు. వివిధ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా పలువురికి రూ.8,47,000 మంజూరైనట్లు తెలిపారు.

బిజెపిలో చేరిన 'కాపు' దంపతులు

రాయదుర్గం : రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి శనివారం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మధుకర్, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధరేశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ట్రెల్లిస్ స్కూల్‌కి మూడోసారి జాతీయ అవార్డు

అనంతపురం : విద్యారంగంలో ఐకాన్‌గా నిలిచిన అనంతపురానికి చెందిన ది ట్రెల్లిస్ స్కూల్‌కు ఈ ఏడాది కూడా ఉత్తమ జాతీయ అవార్డు వరించింది. ప్రతిఏటా మార్చి 15న దేశ రాజధాని ఢిల్లీలో లోనేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవానికి ఎంపిక చేసినట్లు సంస్థ దక్షిణ భారతదేశ బాధ్యులు పేరూరు బాలకృష్ణ తెలిపారు.కాగా వెనుకబడిన రాయలసీమ ప్రాంతం నుంచి విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న ఈ పాఠశాలను వడ్ల శ్రీకాంత్ 2020లో అనంతపురంలోని అశోక్‌నగర్‌లో స్థాపించారు. దేశ భవిష్యత్తు మార్చే విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నందుకు అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. అనంతపురం జిల్లా ప్రజలు, ప్రముఖులు ట్రెల్లిస్ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న ట్రెల్లిస్ యాజమాన్యం

పామిడిలో వైసిపి సంబరాలు

పామిడి : గుంతకల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.వెంకట్రామిరెడ్డిని మూడోసారి ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జానకిరామ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, శోభామసూద్‌రెడ్డి, జోజోడే కుమార్, నాగూర్ ఈశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సూరి, అబ్దుల్, జనార్ధన్‌రెడ్డి, గౌస్, సల్లుద్దీన్, రజాక్, అబూసాలేహా, బాబాఫక్రుద్దీన్, తుల్లాబాయి, జాఫర్, మహేష్‌రెడ్డి, దేవరపల్లి నక్కా ఓబులేసు, నరసింహా, కేశవ్, మధుసూదన్‌రెడ్డి, బోయ యల్లప్ప, డీలర్షు నాగేష్, రమణ, ఓబుళాపురం ఓబులేసు, ఆది, బాలకృష్ణ, కొత్తపల్లి సూర్యనారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 208 కేసులు పరిష్కారం

రాయదుర్గం : రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 208 కేసులు పరిష్కారం అయినట్లు న్యాయసేవా అధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఎ.ఓంకార్ తెలిపారు. ఇందులో 4 భారత శిక్షాస్మృతి, 26 ఎక్సైజ్, 173 పెట్టీ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

గుత్తి : పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం న్యాయా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవాసమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి బి.సాదుబాబు, జూనియర్ సివిల్ జడ్జి వి.దీప్తి 89 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, బెంచ్ సభ్యులు ఎంఎం.రసూల్, ఎన్.ఓబులేసు, వి.సోమశేఖర్, పి.ఓబులేసు, టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మహిళా నాయకురాలిపై ఫిర్యాదు చేస్తాం

పుట్లూరు : మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు శనివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న వైసిపి మహిళా నాయకురాలు, యానిమేటర్‌గా పని చేస్తున్న కృష్ణవేణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కార్యక్రమంలో వైసిపి నాయకురాలికి అంత ప్రాధాన్యత ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వీటిపై మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. వెంటనే ఆమెను యానిమేటర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆత్మకూరు : మండల కేందానికి చెందిన దివ్యాంగుడు అక్కులప్ప యాదవ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వికలాంగ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. అక్కులప్పపై దాడి చేసిన వారిపై నామమాత్రం కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుడిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇనుప రాడ్డు, రాళ్లతో దాడి చేసినా ఇంత వరకూ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే దివ్యాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు నాయకులు కొణతం చంద్రశేఖర్, ఉమాపతి పిళ్లై, హరినాథరెడ్డి, చిరంజీవి, స్థానిక నాయకులు గంగన్న, రామాంజనేయులు, రాజశేఖర్, రామాంజి, వన్నూరువలి, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు గుర్తింపు బ్యాడ్జీలు పంపిణీ

బొమ్మనహాల్ : మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన 28 మంది హమాలీలకు సిఐటియు గుర్తింపు ఇత్తడి బ్యాడ్జీలు శనివారం గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ పొట్టకూటి కోసం పని చేస్తున్న హమాలీలు ఈ బిల్లలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కాగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూలీల పొట్ట కొడుతోందన్నారు. ముఖ్యంగా చీకటి చట్టాలను అమలు చేసి అటు రైతులు, ఇటు హమాలీలకు అన్యాయం చేసేందుకు పూనుకుందన్నారు. వీటిని తిప్పికొట్టేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు, హమాలీలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు ప్రారంభం

రాయదుర్గం : పట్టణంలోని ముత్తరాసు కాలనీలో ఏర్పాటు చేసిన రెండు నీటి ట్యాంకులను వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి శనివారం ప్రారంభించారు. 15వ వార్డులో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో రెండు నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళుశిల్ప, ఉపాధ్యక్షులు వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు ఉపేంద్రరెడ్డి, శివప్ప, శ్రీనివాసులు, శివ, వార్డు సభ్యులు ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని ఆనందరావుపేట గ్రామంలో నివాసం ఉంటున్న నారాయణమ్మ జయరామ్ కుమారుడు హనుమంతు వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారి వైవాహిక జీవితం ఆనందంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, సాకే అనిల్, బెస్త నారాయణస్వామి, మల్లికార్జున, బెస్త అమర్‌నాథ్, కాయల సురేష్‌యాదవ్, ప్రసాద్‌నాయక్, శీనానాయక్, నరసింహానాయక్, దండు ప్రకాష్, సతీష్ రాయల్, జంఘంశెట్టి నవీన్, రామదాసు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధి శిబిరం

రాయదుర్గం : రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మూర్ఛవ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ మూర్ఛవ్యాధి వైద్య నిపుణులు గోపాలం శివనారాయణ సుమారు 42 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ, వీరన్న, జగదీష్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బండారు శ్రావణిశ్రీ ఎన్నికల ప్రచారం

నార్పల : మండల పరిధిలోని నాయనపల్లి గ్రామంలో టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, వెంకటేశ్వరనాయుడు, ఎర్రినాగప్ప, రాజుగౌడ్, జాఫర్, రాజన్న, జనసేన నాయకులు రామకృష్ణ, నాగేంద్ర, నాగేష్, రామకృష్ణ, వెంకటరాముడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం నేత తిమ్మయ్యకు మాతృవియోగం

ఉరవకొండ : విడపనకల్లు మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన సిపిఎం తిమ్మయ్య మాతృమూర్తి వన్నూరమ్మ (71) శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు రంగారెడ్డి, విరూపాక్షి, జ్ఞానమూర్తి, కోటంకి రాముడు, విడపనకలు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, ఎంపిటిసి ఓబులేష్, సర్పంచి సుశీలా ఉమాశంకర్, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, హంపయ్య, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, శంకరయ్య, లాలెప్ప, మస్తాన్, నెట్టికల్లు, దుగ్గెన్న తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే : ఇఆర్‌ఒ

రాయదుర్గం : కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాల్సిందేనని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కరుణకుమారి సూచించారు. శనివారం రాయదుర్గంలోని తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగానే ఎన్నికల నిబంధనలు అమలులోకి వస్తాయన్నారు. ముఖ్యంగా పోటీలో ఉండే వివిధ పార్టీల అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు, అఫిడవిట్‌తో పాటు సమర్పించాలన్నారు. నామినేషన్ల వివరాలు ఏరోజుకారోజు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. బ్యాలెట్‌లో అభ్యర్థుల పేర్లు గుర్తులు తప్పులు లేకుండా సరైన సమాచారం ఇవ్వాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును పరిశీలించేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాలంటీర్లు ఎన్నికల విధులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, మున్సిపాలిటీలో కమిషనర్ సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారన్నారు.నియోజకవర్గంలో కర్ణాటక సరిహద్దున ఉన్న నేపథ్యంలో 8చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఐదు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ని 'కలల్లో'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐదేళ్లకు ఒకసారి జరిగేవి కేవలం ఎన్నికలు ఓట్లు వేయడం వరకే కాదు.. ఈ ఎన్నికల్లో ఎన్నుకునే ప్రభుత్వాలు, అవి సాగించే పాలన ఎంతో ముఖ్యం. ఎందుకంటే మనిషి జీవితం రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికార పగ్గాలు చేపట్టాక ఆ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు మనిషి జీవితంపై ఎంతగానో ప్రభావం చూపుతుంటాయి. ఎన్నికల సమయంలో అందరూ ప్రజలకు ఎంతో మేలు చేస్తామంటు వాగ్దానాలు, హామీలివ్వడం, అమలు చేసే సమయంలో అందుకు భిన్నంగా ఉండటం వంటివి జరుగుతూ ఉంటాయి. అందుకే ప్రజాస్వామ్యంలో మనిషి ఓటుకు ఎంతో విలువ ఉంటుంది. ఆ ఓటే మనిషి జీవితాన్ని శాసిస్తోందన్నది సత్యం. దీని కోసమే ఆయా రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సమయంలో అనేక హామీల్వడంమే కాకుండా ప్రజలను ఊహాల్లోనూ, కలల్లోనూ విహరింపజేసే ప్రకటనలు చేస్తుంటాయి. ఆ తర్వాత గద్దెనెక్కాక ప్రజలపై భారాలు వేస్తుంటాయి. ఇప్పుడు జరుగుతున్న రాజకీయాల్లో సంక్షేమ పథకాల చుట్టూ నడుస్తున్నాయి. అభివృద్ధి, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం వంటి అంశాలు పెద్దగా చర్చకు రావడం లేదు. గడిచిన ఐలేళ్లలో ఇప్పటికీ ఉద్యోగ భర్తీలు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నోటిఫికేషన్‌లు విడుదల చేసి హడావుడి చేయడం మినహా పూర్తి చేసే పరిస్థితి లేదు. మరోవైపు అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సిపిఎం జిల్లా అభివృద్ధి ప్రణాళిక ఈ ఎన్నికల్లో ప్రధాన అంశం కావాలని కోరుతున్నారు. ఈ మేరకు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులందరికీ సమగ్రాభివృద్ధిపై చర్చించాలని, ఎన్నికల్లో ఆ అంశాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. అభివృద్ధి ప్రణాళికను అందజేసింది. అయితే ఈ దీనిపై ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిలు ఏ మేరకు స్పందిస్తాయన్నది చూడాల్సి ఉంది. ఎన్నికల్లో ఇచ్చే హామీల్లాగానే ఉంటాయా లేక ఈ అంశాలే చర్చ రాకుండా ఇతర వాటిపై రాజకీయాలు మల్లుతాయా అన్నది చూడాల్సి ఉంది. శనివారం నాటితో ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఇక ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చినట్టయింది. అయితే రాష్ట్రం నాలుగో విడత పోలింగ్‌లో ఉండటంతో వచ్చేనెల 18న నోటిఫికేషన్ రానుంది. అధికార యంత్రాంగం ఇప్పటికే ఎన్నికలకు సమయత్తమవుతోంది. ఇక రాజకీయ పార్టీలు మరింత వేగంగా పావులు కదుపుతున్నాయి. అధికార వైసిపి అభ్యర్థులందరినీ ప్రకటించింది. టిడిపి ఇంకా రెండు స్థానాలతోపాటు, పార్లమెంటు స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. టిడిపిలో ఇంకా అసంతృప్తులు కొనసాగుతున్నాయి. వాటిని అధిష్టానం ఏ మేరకు సర్దుబాటు చేయగలుగుతుందో చూడాల్సి ఉంది. ప్రజలు మాత్రం ఏ పార్టీ తమ భవిష్యత్‌ను మార్చగలిగే విధంగా కృషి చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సాగు,తాగునీటికష్టాలు తీరడం లేదు. గడిచిన మూడేళ్లుగా కొంత వరకు వర్షాలు పడినప్పటికీ 2023 సంవత్సరంలో వర్షాభావం నెలకొంది. ఎప్పటిలాగానే ఈ ఏడాది కరువు నెలకొనడంతో రైతులు నష్టాలను చవిచూశారు. పంటల్లేక వలసలు పోతున్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపే పాలకులు ఈసారైన రావాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల సమయంలోనైనా నేతలు ఈ అంశాలపై దృష్టి సారించి ఎటువంటి పరిష్కారాలు చూపుతామని హామీలిస్తారో చూడాల్సి ఉంది.